ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

మంగళవారం 21 జనవరి 2025 | 5





వాషింగ్టన్ టు బుష్

ప్రత్యేక కథనం 6లో

డాలర్ నాణేల సేకరణ

భీమేశ్వరుని కల్యాణోత్సవాల పై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

ద్రాక్షారామ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో సోమవారం కల్యాణ మహోత్సవాల నిర్వహణపై ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గా భవాని, ఆలయ అర్చకులు, వేద పండితులు, భక్తులతో సమీక్ష నిర్వహించారు. దేవస్థానం అర్చకులు, వేద పండితులు నలుగురు సభ్యులతో వైదిక కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో భవానీ వివరించారు. ఆలయంలో జరిగే వైదిక కార్యక్రమాలు నిర్వహణ విధివిధానాలు, ముహూర్తాలు ఈ వైదిక కమిటీ నిర్ణయిస్తుందన్నారు. కల్యాణోత్సవాలపై మంత్రి సమీక్ష జరిపారు. స్వామివారి కల్యాణం, శ్రీచక్రస్నానం, పండిత సదస్యం, రథోత్సవం, తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మంత్రి సుభాష్ కల్యాణోత్సవాలు పురస్కరించుకుని స్వామివారి రథానికి పూజలు చేసి బయటకు తీసేందుకు కొబ్బరికాయ కొట్టారు.

అంతర్వేది కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు మాఘమాసంలో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగుతాయని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం ఆలయంలో స్వామివారి వార్షిక మహోత్సవాల వాల్ పోస్టర్, ఫ్లెక్సీలను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆవిష్కరించారు. మెరుగైన సేవలను భక్తులకు అందించేలా చూడాలని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం కల్యాణోత్సవాల ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా కమిటీ నిర్వహణపై ఎప్పటికప్పుడు సమాచారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, బర్రే శ్రీను, అయినపర్తి ఏసు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2వరకు కుష్టు వ్యాధి బాధితుల

గుర్తింపు ప్రక్రియ

కలెక్టర్ మహేష్‌కుమార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫిబ్రవరి 2 వరకు కుష్టు బాధితులను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో ఈ నెల 20 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించారన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనా కార్యక్రమం వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, వీపుపై నొప్పిలేని బొడిపెలు వంటివి ఉన్నవారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఉపశమనం పొందవచ్చునన్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు మీ ఇళ్ల వద్దకు వచ్చే ఆరోగ్య కార్యకర్తలు ద్వారా పరీక్షలు చేయించుకోవచ్చునన్నారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోను ఉచితంగా మందులు అందిస్తామని చెప్పారు. అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం కోసం బలితీసుకున్నాడు

తోటపేటలో మహిళ అనుమానాస్పద మృతి

మిస్టరీని ఛేదించిన పోలీసులు

నిందితుడి అరెస్టు 7లో

'అన్నవరం' ఖజానాకు రూ.81.84 లక్షలు

7లో



కందాలపాలెం గోదావరి నదీపాయలో బాట వేస్తున్న దృశ్యం

వైపీ పాలెం ఇసుక ర్యాంపులో బాటలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఇప్పటి వరకు నిబంధనలు పక్కనపెట్టి ఉచిత ఇసుక పేరుతో నడుస్తున్న ఇసుక అక్రమ ర్యాంపులకు తోడుగా తువ్వమట్టి ర్యాంపులు కూడా సిద్ధం చేస్తున్నారు మాఫియా పెద్దలు. పి.గన్నవరరం మండలంతో పాటు కోనసీమలోని పలు నదీతీర ప్రాంతాలు సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నాయని చెప్తున్న అధికారులు ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలకు ఎందుకు వంత పాడుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

డీఎస్ పాలెంతో పాటు లంకలగన్నవరం, మానేపల్లి, గంటిపెదపూడి గ్రామాల్లో అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా..రెవెన్యూ, మైన్స్‌తో పాటు సంబంధిత అధికారులు ర్యాంపులు వైపు కన్నెత్తి చూడడం లేదు.

తువ్వ మట్టినీ వదల్లేదు..!

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): తాజాగా గత రెండు రోజులుగా తువ్వ మట్టి తవ్వకాలకు ర్యాంపులకు మాఫియా పెద్దలు భారీ ప్రణాళికలతో రంగంలోకి దిగుతున్నట్లు తెలుస్తుంది. మండలంలోని ఇప్పటికే ఉడిమూడి వద్ద లంకలోని మట్టి తవ్వకాలకు ఆ ప్రాంతంలో రైతుల పేరిట నదీపాయకు అడ్డుకట్ట వేశారు. ఆ ప్రాంతంలో రాత్రివేళల్లో సైతం టిప్పర్లతో తువ్వమట్టి రవాణాకు శ్రీకారం చుట్టారు. కూటమి నాయకుడు మద్దతుతో పక్క నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడితో పాటు మరో కీలక వ్యక్తి ర్యాంపును నిర్వహిస్తున్నారని పలువురు కూటమి నాయకులే తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కనీస అను మతులు లేకుండా తువ్వమట్టి తవ్వకాలు జరపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదే విధంగా పి.గన్నవరం డీఎస్ పాలెం వద్ద అక్రమ ఇసుక ర్యాంపు చెంతనే మరో తువ్వమట్టి ర్యాంపునకు రంగం సిద్ధం చేసి కూటమి పెద్దలు మధ్య ర్యాంపులు కోసం రగడ రావడంతో బాట పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. అక్విడెక్టు వద్ద నదీ ప్రవాహం దిశ మార్చుకోవడంతో ఇటీవల ఆ ప్రాంతంలో తువ్వమట్టి నిల్వలు ఏర్పడ్డాయి. ఆ నిల్వలు తొలగించడానికి కూటమి పెద్దలు పూర్తి సహకారంతో ప్రభుత్వ పనులు ముసుగులో అనుమతులు లేకుండానే భారీ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.



ఉడిమూడి వద్ద లంకలో తువ్వమట్టి తవ్వకాలు

- పుట్ట గొడుగుల్లా.....తువ్వ మట్టి ర్యాంపులు
- నదీపాయలకు అడ్డుకట్టలు వేస్తున్న మట్టి మాఫియా!
- తువ్వమట్టి తవ్వకాలకు భారీ ప్రణాళికలు
- నిబంధనలకు విరుద్ధంగా బాటలు ఏర్పాటు
- రాత్రివేళల్లో సైతం తవ్వకాలు
- కూటమి నాయకుల మధ్య ర్యాంపుల రగడ
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కూటమి నాయకుల మధ్య వివాదం

ర్యాంపు కోసం నియోజకవర్గ కూటమి పెద్ద వద్ద పంచాయతీ కూడా జరిగినట్లు తెలుస్తోంది. పక్కనే అనధికారికంగా నడుస్తున్న ఇసుక ర్యాంపు నిర్వాహకుల్లో ఒకరైన టీడీపీ నాయకుడొకరు ఆ ర్యాంపునకు అడ్డు చెప్పినట్లు తెలిసింది. ర్యాంపు నడిపేది పక్క నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులే అయినప్పటికి బాటలో వైసీపీ నాయకులు ప్రమేయం ఉందని ఎలా మద్దతు ఇస్తారని నియోజకవర్గ కూటమి పెద్ద వద్ద ఆ నాయకుడు వాపోయినట్లు తెలిసింది. దీంతో ఆ ప్రాంతంలో ఎక్సకవేటర్లు ఉన్నప్పటికి బాట పనులు తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే మానేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కందాలపాలెం వద్ద ప్రభుత్వ పనులు నిమిత్తం తువ్వమట్టి తవ్వకాలు జరిపేందుకు అనుమతులు రాకుండానే బాటలు సిద్ధం చేస్తున్నారు. నదీ పాయలకు అడ్డుగా సిమెంట్ తూరలు ఏర్పాటు చేసి ఇసుక బస్తాలతో బాటలు వేస్తున్నారు. ఆ ప్రాంతంలో మరో ర్యాంపు నిమిత్తం నదీపాయకు అడ్డుకట్ట వేసేందుకు ఏకంగా డ్రెడ్జర్‌నే సిద్ధం చేసినట్లు తెలిసింది. అదే విధంగా వైపీ పాలెం దిగువున లంకలగన్నవరానికి చెందిన జిరాయితీ భూముల్లో అనుమతులు రాకుండానే రెండు రోజులుగా ఇసుక తవ్వకాలు మొదలు పెట్టారు. రాబోయే రోజుల్లో జిల్లా సరిహద్దు ప్రాంతాలలో సైతం ర్యాంపులు ఏర్పాటుకు మంతనాలు జరుగుతున్నాయి.

అనుమతులు రాకుండానే..

ప్రభుత్వ పనులు పేరు చెప్పి ఒకరు, వరదల సమయంలో ఇసుక, తువ్వ మేటలు వేశాయని వాటిని తొలగించుకుని వ్యవసాయం చేసుకుంటామని మరొకరు ఇలా..ఎవరికి తోచిన రీతిలో వారు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే కొందరు అయితే అనుమతులు రాకుండానే తవ్వకాలు ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం గన్నవరం మండలంలో తువ్వ మట్టి ర్యాంపులు నిమిత్తం అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. కానీ వారి నుంచి ఏవిధమైన అనుమతులు రాకుండానే బాటలు ఏర్పాటు చేసుకుని అడ్డగోలుగా తువ్వమట్టి, ఇసుకను దోచుకుపోతున్నారు. రాత్రివేళల్లో సైతం తవ్వకాలు జరిగినా అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

అనుమతులు ఇవ్వలేదు..

పి.గన్నవరం మండలంలో తువ్వమట్టి తవ్వకాలకు అనుమతులు మంజూరు నిమిత్తం దరఖాస్తులు మాత్రమే చేసుకున్నారు. ప్రస్తుతం దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. పరిశీలన అనంతరం ర్యాంపులకు అనుమతులు వస్తాయి. అనమతులు లేకుండా ర్యాంపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

తహశీల్దార్ పి.శ్రీపల్లవి

అర్జీల పరిష్కారంలో బాధ్యతారాహిత్యం తగదు

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో బాధ్యతా రాహిత్యానికి తావు లేకుండా ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. పరిష్కార సరళిపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఎస్‌డీసీ కృష్ణమూర్తి అర్జీదారుల నుంచి 199 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసం కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు మండల, వార్డు స్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. మండల స్థాయిలో మీ కోసం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ డివిజన్, జిల్లా స్థాయిల్లో అర్జీదారుల తాకిడిని తగ్గించాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యల గురించి అర్జీదారులు జిల్లా కార్యాలయానికి వస్తున్నారని, దీని వల్ల ప్రజలకు డబ్బు, సమయం వృధా అవుతున్నాయన్నారు. ప్రతీ సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లోని తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియచేయాలని సూచించారు. మండల, పురపాలక సంఘాల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లాస్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో సమర్పించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 27 అర్జీలు



అర్జీలు పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమాన్ని ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు 27 అర్జీలను అందించగా వారి సమస్యలను స్వయంగా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అప్పటికప్పుడు అర్జీలు అందిన ప్రాంతాలకు చెందిన పోలీసు అధికారులతో మాట్లాడి నిబంధనల మేరకు ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ఆదేశించారు.

ఆత్మవిశ్వాసం మెండుగా



గ్రీవెన్స్ అప్లికేషన్ పూర్తిచేస్తూ..

అమలాపురం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో ఆ అబ్బాయికి రెండు చేతులు లేవు. కానీ ఆత్మ విశ్వాసం మెండు..ఒకరి మీద ఆధారపడకుండా సొంతంగా ముందుకెళ్లాలనే ఆశయం అతనిది. అందుకే అతని నోటు పుస్తకాలు అతనే రాసుకుంటాడు. ఇప్పుడు ఈ అబ్బాయి పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఎవరి సహాయం లేకుండా సొంతంగా పరీక్ష రాస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాడు రాజోలు గ్రామానికి చెందిన దివ్యాంగుడు చెల్లుబోయిన బాబి. ప్రస్తుతం దివ్యాంగ పెన్షన్ కింద నెలకు రూ.6వేలు వస్తుందని, రెండు చేతులు లేనందున రూ.15 వేలు పెన్షన్ అందించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ అందించారు. అయితే దివ్యాంగ పెన్షన్ నిబంధనల మేరకు రూ.6 వేలు మాత్రమే వస్తుందని వైద్యులు తేల్చి చెప్పారు. దీంతో కొంత నిరుత్సాహంతో బయటకు వచ్చాడు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ తాను రాజోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నానని తెలిపాడు. ఇప్పటికే ఎఫ్ఏ1 ఎఫ్ఏ2 పరీక్షలు ఎవరి సహాయం లేకుండానే రాశానని, మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలు కూడా ఎవరి సహాయం లేకుండానే పరీక్ష రాయనున్నట్టు ఆత్మవిశ్వాసంతో వెల్లడించాడు.

రేపటి నుంచి

కోనసీమ క్రీడోత్సవాలు



ఏర్పాట్లు చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రత్యేక చొరవతో కోనసీమ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా జిల్లాలోని 22 మండలాల పరిధిలోని 2600 మంది పాఠశాలల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో కలెక్టర్ పర్యవేక్షణలో కోనసీమ క్రీడోత్సవాలు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టామన్నారు. సోమవారం అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో కోనసీమ క్రీడోత్సవాల ఏర్పాట్లను అమలాపురం ఆర్డీవో కె.మాధవి, జిల్లా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు పరిశీలించారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా సమగ్రాభివృద్ధిని సాధించాలనే లక్ష్యంతో ఈ క్రీడా పోటీలు ఏర్పాటు చేసినట్టు డీఈవో వివరించారు. పారిశుధ్య ఏర్పాట్లు, తాగునీటి సదుపాయంపై చర్చించారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా పరికరాలు, క్రీడా దుస్తులను కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రత్యేకంగా సమకూర్చినట్టు డీఈవో తెలిపారు. బాలయోగి స్టేడియంలో క్రీడా పోటీల నిర్వహణలో భాగంగా కబడ్డీ, ఖోఖో కోర్టుల మార్కింగ్ పనులను వ్యాయామ ఉపాధ్యాయులు చేపట్టారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి విజయశ్రీనివాస్, కోచ్ ఐ.భీమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు తోట రవి, కామన మధు తదితరులు పాల్గొన్నారు.



త్రుటిలో తప్పిన ప్రమాదం

7లో

పంట పొలంలోకి ఓల్వా బస్సు

బస్సు రూపంలో మృత్యువు

7లో

- రాజమహేంద్రవరంలో బైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు
- గంటల తేడాలో మేనమామ, మేనల్లుడు మృతి



వాషింగ్టన్ టు బుష్



40 మంది అమెరికా అధ్యక్షుల చిత్రాలతో డాలర్ నాణేల ముద్రణ

సేకరించిన కాకినాడకు చెందిన నాణేల సేకరణకర్త జానకిరామ చౌదరి



40 మంది అధ్యక్షుల ముఖ చిత్రాలతో ముద్రించిన డాలర్లు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ సోమవారం రెండోసారి ప్రమాణం చేశారు. కాకినాడకు చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త మార్ని జానకిరామ చౌదరి ఇప్పటివరకు విడుదలైన 40మంది అమెరికా అధ్యక్షుల డాలర్లను సేకరించారు. ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్ష పీఠం అధిరోహించిన సందర్భంగా ఆ విశేషాలను తెలియజేశారు. ఇంతవరకు అధ్యక్షులుగా 46మంది పనిచేయగా 40మంది అధ్యక్షుల ముఖచిత్రాలతో ఒక డాలరు విలువ కలిగిన నాణేలను అమెరికా ప్రభుత్వం ముద్రించింది. వెనుక భాగంలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ చిత్రంతో రాగి, జింక్, మాంగనీస్, నికెల్ మిశ్రమ లోహాలతో విడుదల చేశారు. ఒక్కొక్క నాణెం 8.1 గ్రాముల బరువు కలిగి 26.5 మిల్లీమీటర్ల వ్యాసం, 2 మిల్లీమీటర్ల మందం కలిగి ఉంటుంది. మొట్టమొదటి అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్ (1789-1797)తో ప్రారంభించి జార్జ్ హెచ్‌డబ్ల్యు బుష్ వరకు 40మంది (మరణించిన అధ్యక్షుల) చిత్రాలతో నాణేలను ముద్రించారు. 2007 నుంచి 2011 వరకు పెద్ద సంఖ్యలో చలామణి కోసం ముద్రించారు. కానీ 2012 నుంచి 2017 సంవత్సరం వరకు విడుదలైన నాణేలను కేవలం సేకర్తల కోసం మాత్రమే ముద్రించారు.



జానకిరామ చౌదరి

ఆకాశంలో హరివిల్లు



యానాం రాజీవ్ గాంధీ బీచ్‌రోడ్డులో సోమవారం ఆకాశంలో అద్భుతమైన హరివిల్లు ఆవిష్కృతమైంది. ఎర్రటి, నీలిరంగు మబ్బులతో చూపరులను కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని యానాం బీచ్‌లోని పర్యాటకులను ఆకట్టుకుంది. దీంతో వారు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

- యానాం

ఆపాల్సిందే

- యూనివర్సల్ బయోఫ్యూయెల్స్‌లో ఉత్పత్తి నిలుపుదలకు ఆదేశాలు
- జంతువుల కొవ్వు ఫ్యాటీ యాసిడ్స్‌తో కాలుష్యం
- అనుమతి లేని ముడిపదార్థాల వినియోగం
- నిర్ధారించిన కాలుష్య నియంత్రణ మండలి బోర్డు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో విచారణ

సర్పవరం జంక్షన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జంతువుల కొవ్వు ముడి పదార్థాల వినియోగం, దుర్గంధపూరిత దుర్వాసన వెదజల్లుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన కంపెనీపై ఎట్టకేలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సముద్ర తీరప్రాంతంలో ఉన్న కంపెనీనుంచి పెద్దఎత్తున దుర్వాసన వెదజల్లుతోందని, విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో అధికారులు విచారణ నిర్వహించి అనుమతి లేని ముడిపదార్థాలను ఉపయోగించిందని, పీబీసీ బోర్డు ముందస్తు అనుమతి లేకుండా ముడి పదార్థాలను ఉపయోగించడం.. తిరిగి ప్రారంభించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడడంతో దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినట్లు అధికారులు గుర్తించారు.

డిసెంబరు రెండో వారంలో ఫిర్యాదు

కాకినాడ రూరల్ మండలం వాకలపూడి ఇండస్ట్రియల్ పార్కులో యూనివర్సల్ బయోఫ్యూయెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ పారిశ్రామిక యూనిట్లనుంచి దుర్వాసన వస్తుందని ప్రజలు అధికారులకు డిసెంబరు రెండో వారంలో ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదుల మేరకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు డిసెంబరు 20, 21వతేదీల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీబీసీ బోర్డు అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలు, లోపాలపై మానిటరింగ్ కమిటీ సమావేశం డిసెంబరు నెలాఖరున నిర్వహించారు. జంతువుల టాలో ఆయిల్ అందుకుని, ప్రిగోరిఫికో అల్లానా ప్రైవేట్ లిమిటెడ్, ఔరంగాబాద్, మహారాష్ట్ర ప్రాంగణంలోని నిల్వ ఉన్న ట్యాంకుల్లో 4.535టన్నుల క్రూడ్ యానిమల్ టాలో ఆయిల్ నిల్వ చేసినట్లు గుర్తించారు. నిల్వ చేసిన టాలో ఆయిల్ రిఫైన్డ్ లేదా క్రూడ్ అని నిర్ధారించేందుకు నిల్వ ట్యాంకుల్లో(ట్యాంకు నెంబరు 6003), యానిమల్ టాలో ఆయిల్‌లోని ఫ్రీ ఫ్యాటీయాసిడ్(ఎఫ్ఎఫ్ఏ) కంటెంట్‌ను పొల్యూషన్ నియంత్రణ బోర్డు (పీబీసీ) అధికారులు గుర్తించారు. శుద్ధి చేసిన టాలో ఆయిల్‌లో 0.20శాతం నుంచి 0.62నుంచి 0.69శాతం వరకు నిల్వ చేసిన యానిమల్ టాలో ఆయిల్ ఫ్రీ ఫ్యాటీ యాసిడ్(ఎఫ్ఎఫ్ఏ) 0.62నుంచి 0.69 పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. ఇది నిబంధనలకు వ్యతిరేకంగా పరిశ్రమ శుద్ధి చేయకుండా ముడి జంతు నూనె ఉపయోగిస్తుందని అధికారులు గుర్తించారు. పరిశ్రమ తమ డియోడరైజర్ ప్లాంట్‌లోని క్రూడ్ టాలో ఆయిల్‌లో ఎఫ్ఎఫ్ఏను తగ్గిస్తోందని, స్క్రబ్బర్‌ను వాతావరణంలోకి విడుదల చేసిన తర్వాత ఘనీభవించిన వాయువులు(కీటోన్స్, అమైన్‌లు) నేరుగా విడుదల చేయడంతో తీరప్రాంత గ్రామాలతోపాటు రమణయ్యపేట, వలసపాకల, తిమ్మాపురం తీవ్రమైన దుర్వాసన వెదజల్లినట్లు నిర్ధారించినట్లు కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరరావు తెలిపారు. దీంతోపాటు నవంబరు, డిసెంబరు నెలల్లో 165.46 టన్నుల జెమినీ, ఎడిబుల్ ఆయిల్, ఫ్యాట్స్ ఇండియానుంచి 92.67 టన్నులు, అదానీ విల్మార్‌నుంచి 72.79 టన్నులు యాసిడ్ ఆయిల్ పొంది సమీపంలో యాసిడ్ ఆయిల్‌ని ఉప ఉత్పత్తిగా ఉత్పత్తి చేస్తూ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు గుర్తించామన్నారు. 2024లో బయో డీజిల్ ఉత్పత్తిలో ఎడిబుల్ ఆయిల్ యూనిట్లు ఉపయోగిస్తామన్నారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వెదజల్లి మరింత పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయన్నారు. యూనివర్సల్ బయోఫ్యూయల్స్ సంస్థ నిబంధనలు ఉల్లంఘించడంతో కంపెనీ ఉత్పత్తిని నిలుపుదల చేస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా పరిశ్రమ తదుపరి కార్యకలాపాలు అన్నింటినీ తక్షణమే నిలిపివేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. 2018లో కూడా ఈ కంపెనీ యానిమల్ ఫ్యాట్, టాలో ఆయిల్ వంటి ముడి పదార్థాలు నిబంధనలకు విరుద్ధంగా వినియోగించడంతో ఆరునెలలపాటు కంపెనీలో కార్యకలాపాలు జరగకుండా మూసివేత ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఉత్తర్వులకు వ్యతిరేకంగా పరిశ్రమ కార్యకలాపాలు నిర్వహించినట్లు తేలితే కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం, 1988లో సెక్షన్ 41(2) ప్రకారం వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం ప్రకారం మొదటి తరగతి న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్‌కు గురవుతారని హెచ్చరించారు.

హోరాహోరీగా బ్రాహ్మణ పురోహితుల క్రికెట్ పోటీలు



హర్షకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న పట్టణ సీఐ వీరబాబు

అమలాపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ బ్రాహ్మణ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంటు పోటీలు మూడోరోజు హోరాహోరీగా జరిగాయి. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం అన్నవరం-నర్సీపట్నం జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. ఈ పోటీలో అన్నవరం జట్టు విజయం సాధించింది. కాకినాడ రుద్రాస్-వైజాగ్ లయన్స్ జట్ల మధ్య పోటీలో కాకినాడ రుద్రాస్ విజయం సాధించింది. నర్సీపట్నం-కాత్రేనికోన జట్ల మధ్య పోరులో నర్సీపట్నం జట్టు విజయం సాధించింది. అన్నవరం జట్టు క్రీడాకారుడు హర్ష మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్‌గా ఎంపిక కాగా పట్టణ సీఐ పి.వీరబాబు షీల్డు అందజేశారు. కాకినాడ రుద్రాస్ జట్టు కెప్టెన్ మాధవశర్మ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు షీల్డు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, పాలూరి సత్యానందంతో పాటు పలువురు రాజకీయ రంగ ప్రముఖులు క్రీడా పోటీలను తిలకించారు. కర్రా శివయ్య, పిండి మూర్తి, వేదుల భరద్వాజ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికత.. స్మార్ట్ మెటీరియల్లపై దృష్టి

ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతికత, స్మార్ట్ మెటీరియల్స్‌పై దృష్టిసారించడంతోపాటు పునరుత్పాదక ఇంధన వ్యవస్థలను ఆప్టిమైజ్ చేసేందుకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఉపయోగపడుతుందని ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ ట్రైనింగ్ లెర్నింగ్(అటల్) అకాడమీ సహకారంతో ఈనెల 25వరకూ ఆరురోజులపాటు నిర్వహించే ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ ఆప్టిమైజింగ్ రెన్యూవబుల్ ఎనర్జీ సిస్టమ్ విత్ స్మార్ట్ మెటీరియల్స్ స్టోరేజ్ సొల్యూషన్స్ అంశంపై జాతీయస్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం వీసీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే 50 ఏళ్లలో ప్రపంచం మొత్తం వీటిపై ఆధారపడే ముందుకు వెళతుందన్నారు. మొత్తం 9 రాష్ట్రాల నుంచి 138 మంది అధ్యాపకులు ఎఫ్‌డీపీకి హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొనగా వీవీ సుబ్బారావు సమన్వయకర్తగా వ్యవహరించగా డాక్టర్ డి.లింగరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

మనసువిప్పి మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం

- సందేశాత్మకంగా సాగిన 'విడాకులు కావాలి' నాటిక
- భోగాపురంలో ముగిసిన జాతీయస్థాయి నాటికల పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా 'నా శత్రువు' నాటిక ఎంపిక

మనసువిప్పి మాట్లాడుకుంటే దంపతుల మధ్య సమస్యల పరిష్కారమవుతాయి. అంతేగాని పంతాలకు వెళ్లి విడాకులకు దారితీసే పరిస్థితులు తెచ్చుకోవద్దని సందేశమిస్తూ సాగింది గుంటూరుజిల్లా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన విడాకుల కావాలి నాటిక.



జాతీయస్థాయి నాటిక పోటీల్లో ప్రదర్శించిన విడాకులు కావాలి నాటికలోని సన్నివేశం

పిఠాపురం/పిఠాపురం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వ ర్యంలో జరుగుతున్న కొణిదెల పవన్‌కల్యాణ్ జాతీయస్థాయి నాటికల పోటీలు నాల్గవరోజు ప్రదర్శించిన ఈ నాటిక ప్రస్తుతం చిన్న చిన్న విభేదాలతో విడిపోతున్న దంపతులకు హితవు పలుకుతూ దాంపత్య జీవితం ఎలా ఉండాలో వివరించింది. అహంకారంతో పట్టుదలకు పోకుండా సర్దుబాటు ధోరణితో సంయనం పాటించడం ద్వారా ఆదర్శ దంపతులుగా గడపవచ్చునని చాటిచెప్పింది. భారతీయ వివాహ వ్యవస్థలో మన సంస్కృతి సంప్రదాయాలే దాంపత్య జీవితాలను అన్యోన్యంగా నడిపే దారిదీపాలని, ఇచ్చిపుచ్చుకునే సంస్కారం దాంపత్యాన్ని ఆనందమయం చేస్తుందని తెలియజెప్పింది. వల్లూరి శివప్రసాద్ ఈ నాటికను రచించగా, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు.

ముగిసిన నాటిక పోటీలు

భోగాపురంలో నాలుగు రోజులపాటు జరిగిన జాతీయస్థాయి నాటికల పోటీలు సోమవారం తెల్లవారుజామునతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్నాటక రాష్ట్రం నుంచి వచ్చిన కళాకారులు తొమ్మిది నాటికలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాద్‌కు చెందిన యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ కళాకారులు ప్రదర్శించిన నా శత్రువు నాటిక ఎంపిక కాగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ద్వారబంధాల చంద్రయ్యనాయుడు(గుడివాడ కృష్ణ ఆర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్), తృతీయ ప్రదర్శనగా ఇది రహదారి కాదు (హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్), ఉత్తమ జ్యూరీ ప్రదర్శనలుగా అసత్యం (ఉక్కునగరం చైతన్య కళాస్రవంతి), ఉక్కు సంకెళ్లు(హైదరాబాద్ మహతి క్రియేషన్స్) నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ రచనగా ఇది రహదారి కాదు నాటిక రచయిత ఆకురాత్రి భాస్కరరావు, ఉత్తమ దర్శకత్వం పి.కృష్ణహితేష్(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు), ఉత్తమ నటుడిగా పి.బాలాజీనాయక్(అసత్యం), ఉత్తమ నటిగా సునయన (నా శత్రువు), ఉత్తమ విలన్‌గా శరత్‌కుమార్(ఉక్కుసంకెళ్లు), ఉత్తమ ద్వితీయ నటుడిగా జరుగుల రామారావు(ప్రేమించే వయసేనా), ద్వితీయ నటిగా బండారు నాగరాణి (ఇది రహదారి కాదు), ఉత్తమ బాలనటిగా యష్మిత(నా శత్రువు), ఉత్తమ సహాయ నటుడిగా మురళీమోహన్(చీకటి బతుకులు), సహాయ నటిగా వసంతయామిని(విడాకులు కావాలి), ఉత్తమ సంగీతం సురభి నాగరాజు(ఇది రహదారి కాదు), ఉత్తమ ఆహార్యంగా వీవీ సత్యనారాయణ(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు), ఉత్తమ రంగాలంకరణగా థామస్(విడాకులు కావాలి), ఉత్తమ రంగోద్దీపనగా కృష్ణహితేష్(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు), ప్రత్యేక ప్రశంసగా చీకటి బతుకులు నాటిక, నటుడిగా ఎన్ఎస్ఎస్ ప్రసాద్(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు ఎంపికయ్యారు. వీరికి భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు, మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు న్యాయవాది పడాల రవి, పలువురు ప్రముఖ కళాకారుల ద్వారా నగదు పురస్కారాలు, వారాహి అవార్డులు అందజేశారు. ఈ నాటికల పోటీలకు న్యాయనిర్ణేతలుగా మహ్మద్ ఖాజావలీ, ఎంవీ రమణ, ఎం.తాతికొండలు వ్యవహరించారు.





జాతీయస్థాయి నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన నా శత్రువు నాటికకు వారాహి అవార్డు, ఉత్తమ పురస్కారాన్ని అందజేస్తున్న భోగాపురం నాటక కళా పరిషత్ ప్రతినిధులు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ద్వారబంధాల చంద్రయ్యనాయుడు నాటికకు పురస్కారం, వారాహి అవార్డు అందజేస్తున్న దృశ్యం

రేపు బాలికల హాకీ జిల్లా జట్టు ఎంపిక

కాకినాడఅర్బన్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): బాలికల సబ్ జూనియర్ హాకీ జిల్లా జట్టు ఎంపిక ఈనెల 22న కాకినాడ డీఎస్ఏ మైదానంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తారని హాకీ సంఘం జిల్లా కార్యదర్శి నంబు శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2009 తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 27నుంచి 29వరకు అనంతపురంలో జరిగే అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాలికల హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు.

రెండోరోజు అలరించిన గాత్ర కచేరీ



గాత్ర కచేరి నిర్వహిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంగీత విద్వత్సభ కాకినాడ వారి ఆధ్వర్యంలో సూర్యకళామందిరంలో సంక్రాంతి గాన సభల పదిరోజుల కార్యక్రమాల్లో రెండోరోజు పతంగి సోదరుల(శ్రీ దాత్రే, ధృవ్) చెన్నైవారి గాత్ర కచేరి అద్భుతంగా జరిగింది. వారు సౌరాష్ట్ర రాగంలో శరణు సిద్ధి వినాయక, విద్వాన్ చిత్రవీణ ఎన్.రవికిరణ్ శ్రీశైలం మల్లిఖార్జునేశ్వరుడిపై కేదారగౌళ రాగంలో ర చించిన ద్వాదశ జ్యోతిర్లింగ గీత మాల రేయి పగలు నిన్నే నమ్మినాడు, పంతువరాళి రాగంలో ఎన్నగాను రామభజన, కమాస్ రాగంలో బ్రోచేవారెవరురా కీర్తనలు గానంచేసి మైమరపించారు. వీరికి వయోలిన్‌పై బండే మాధవన్, చెన్నై, మృదంగంపై కె.యోగీష్, ఘటంపై శ్రీ సరస్వతుల హనుమంతరావు చక్కటి సహకారాన్ని అందించారు. ఆలపాటి లక్ష్మీ సుభద్ర, సుభాషిణి, పంతం నాగేశ్వరి, చావలి సూర్యకుమారి, కె.సుబ్బలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు.

దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

- కల్నల్ హెచ్ఎస్ మానిక్
- శ్రీప్రకాష్‌లో కొనసాగుతున్న చెస్ పోటీలు

పెద్దాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : దేశం గర్వించదగ్గ సాటి మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దబడాలని మూడో ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్ఎస్ మానిక్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఐదురోజులపాటు జరుగనున్న జాతీయస్థాయి స్కూల్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల నాల్గవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా సోమవారం హాజరై మాట్లాడారు. క్రీడాకారులు దేశానికి మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. చెస్ క్రీడ ద్వారా మేధస్సు పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభను కనబరిచి దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం చెస్ క్రీడలను తిలకించారు. కల్నల్ మానిక్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది నరసింహన్, వైడీ రామారావు, డాక్టర్ విజయనరసింహన్, డీఎస్‌పీ వీరన్న, పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



కల్నల్ మానిక్‌ను సత్కరిస్తున్న శ్రీప్రకాష్ పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

లలితా జ్యూయలరీ తునికి రావడం

శుభ పరిణామం

- మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు
- తునిలో అట్టహాసంగా లలితా జ్యూయలరీ ప్రారంభోత్సవం



లలితా జ్యూయలరీ అధినేత కిరణ్‌కుమార్‌తో కలిసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



సంస్థ చైర్మన్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ నగల వ్యాపార సంస్థ లలితా జ్యూయలరీ తునికిరావడం శుభ పరిణామమని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తునిలో లలితా జ్యూయలరీ 59వ షోరూం సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. తుని మెయిన్‌రోడ్డులో నూతన హంగులతో రూపుదిద్దుకున్న లలితా జ్యూయలరీ మాల్‌ను మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, లలితా జ్యూయలరీ అధినేత డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకు డు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ గతం మాదిరిగా తునిలో అరాచక పరిస్థితులు లేవని, కూటమి ప్రభుత్వం రాకతో తునిలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. ఫలితంగా వ్యాపా ర కేంద్రంగా ఎంతో అభివృద్ధి చెందిన తునికి కార్పొరేట్ సంస్థలు వ్యాపారాలు నిర్వహించేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. పెద్దఎత్తున వ్యాపార సంస్థలు కొలువు తీరితే తుని పట్టణం అభివృద్ధి చెందుతుందని, క్రయ విక్రయాలు జరుగుతూ ఉంటే ట్యాక్స్‌ల రూపాన ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని, ఆదాయం వస్తే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. దీంతోపాటుగా యువతకు ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని యనమల స్పష్టం చేశారు. లలితా జ్యూయలరీ చైర్మన్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ తనకు వ్యక్తిగతంగా ఆత్మీయుడని ఆయన ఆహ్వానం మేరకు తునిలో లలితా జ్యూయలరీ షోరూంను ప్రారంభించడం ఆనందా న్ని ఇచ్చిందన్నారు. లలితా జ్యూయలరీ అధినేత డాక్టర్ ఎం.కిరణ్ కుమార్ మాట్లాడుతూ బంగారం కొనుగోలు ఇప్పుడు సాధారణ విషయంకాదని, నగలు కొనేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అచ్చొచ్చిన చోటు అని ఎన్నో సంవత్సరాలు ఒకేచోట కొంటున్నామనే ఉద్దేశంతో అధిక ధరలకు, అధిక తరుగుకు నగలు కొనడం కరెక్ట్‌కాదని స్పష్టం చేశారు. తెలివైన నిర్ణయంతో నగలు కొనాలని కోరారు. లలితా జ్యూయలరీలో నగలు కొనాలని చెప్పడం లేదని లలితలో మీకు నచ్చిన నగడుకు ఎస్టిమేట్ స్లిప్ ఫొటోలు తీసుకుని నాలుగైదు షోరూంలో ధరలు పోల్చి ఎక్కడ ధర తక్కువో అక్కడే నగలు కొనుగోలు చేయాలని తెలిపారు. ఇలా పోల్చిచూడమని ఇతర నగల షోరూంలు చెప్పిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నిస్తూ ఇది మా పారదర్శకత అని తెలిపారు. తుని ప్రజలతో తనకు మరింత అనుబంధం ఏర్పడిందని తెలుగుతనం ఉట్టిపడే ఈ ప్రాంతంలో కొత్తషోరూం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని బంగారు నగలపై మార్కెట్ కంటే 2శాతం తగ్గింపుతోపాటుగా వజ్రాభరణాలు క్యారెట్‌కు రూ.6వేలు తగ్గిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు నగలు కొనుగోలు చేసేందుకు తరలి రావడంతో మెయిన్‌రోడ్డు సందడిగా మారింది. డబ్బులు ఊరికే రావంటూ తెలుగు రాష్ట్ర ప్రజానీకానికి సుపరిచితుడై తన షాపులకు తానే ఒక బ్రాండ్ అబాసిడర్‌గా గుర్తింపు పొందిన కిరణ్‌కుమార్‌తో కొనుగోలుదారులు ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. సంస్థ చైర్మన్ కిరణ్ కుమార్ ఆధ్యాత్మం ఆత్మీయ పలకరింపుతో అందరినీ ఆకట్టుకుంటూ లలితా జ్యూయలరీ మాల్ ప్రారంభోత్సవంలో ఎట్రాక్షన్‌గా నిలిచారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌ను సందర్శించిన డీజీపీ తిరుమలరావు


డీజీపీకి మొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న కమాండెంట్ దీపిక పాటిల్

సర్పవరం జంక్షన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌ను రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఎస్పీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం బెటాలియన్‌కు చెందిన ఇంగ్లీష మీడియం పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఏపీ ఎస్పీ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు, కమాండెంట్ దీపిక పాటిల్, అసిస్టెంట్ కమాండెంట్ దేవానంద రావు తదితరులున్నారు.



ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న డీజీపీ

కాకినాడ ఆర్టీసీ డిపో సందర్శన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు సోమవారం కాకినాడ డిపోను సందర్శించారు. డిపో పరిసరాలను పరిశీలించి గ్యారేజ్‌లో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్స్ ఎన్‌జీ.రావు, వీఎస్.మూర్తికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గొల్ల విజయరత్నం, కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకరావు, డీపీటీవో ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కెఎం.భాషా, పీఆర్వో సీహెచ్ వెంకట్‌రాజు పాల్గొన్నారు.

బస్సు రూపంలో మృత్యువు

● రాజమహేంద్రవరంలో బైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ● గంటల తేడాలో మేనమామ, మేనల్లుడు మృతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తన మావయ్యను ఇంటి వద్ద దింపడానికి బైక్‌పై బయలుదేరిన యువకుడు తన మామతో పాటు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సెంటర్‌లో ఆది వారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వర్‌నగర్‌కు చెందిన మేడిశెట్టి ప్రసాద్ (53) అంబేడ్కర్‌వాది. అతడు ఆదివారం పంగిడిలో జరిగిన ఎయిమ్ సమావేశానికి వెళ్లాడు. సమావేశం అనంతరం వేరొకరి కారులో రాత్రి 10 గంటలు దాటాక రాజమహేంద్రవరం దానవాయిపేటలో నివాసం ఉంటున్న అతడి మేనల్లుడు నక్క సాయికృష్ణ (23) వద్దకు వచ్చారు. విజయవాడకు చెందిన సాయికృష్ణ రాజమహేంద్రవరంలోని మెడికల్ కంపెనీలో మూడేళ్లుగా పనిచేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో ప్రసాద్ అతడి వద్దకు వచ్చి తనను లాలాచెరువులోని ఇంటి వద్ద దింపాలని అడిగారు. దీంతో తెలిసిన వ్యక్తి వద్ద బైక్ తీసుకుని నెహ్రూనగర్ మీదుగా ఆర్ట్స్ కళాశాల సెంటర్‌కు చేరుకుని రోడ్డు దాడుతుండగా డివైడర్ వద్దకు వచ్చి అటు వైపు నుంచి ఆటో వస్తుందని ఆగారు. ఇంతలో లాలాచెరువు వైపు నుంచి వస్తున్న కాకినాడ-హైదరాబాద్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి వారి బైక్ వెనుక భాగంలో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బస్సును నిలుపుదల చేసి పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అర్ధరాత్రి ఇద్దరి పరిస్థితి విషమించి గంటల తేడాలో మృతిచెందారు. కాగా మేడిశెట్టి ప్రసాద్ ఆటోనగర్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాయికృష్ణకు తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబానికి అతడే దిక్కు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రోడ్డు ప్రమాదం ప్రదేశంలో పడి ఉన్న ప్రసాద్, సాయి కృష్ణ

పాపికొండలకు ఎస్టీ కమిషన్ చైర్మన్


బోటులో వెళ్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

దేవీపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహారయాత్రకు ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు, మరికొంతమంది ప్రజా ప్రతినిధులు పర్యాటక బోటుపై సోమవారం వెళ్లారు. గండిపోశమ్మ తల్లి ఆలయ సమీపంలోని బోటు పాయింటు వద్ద విహార యాత్ర ప్రారంభించారు. చైర్మన్ రాకతో గోదావరి నదీ పరివాహక ప్రాంతమంతా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో ప్రత్యేకంగా తనిఖీలు జరిపారు.

పోలవరం భూసేకరణ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా అభిషేక్

రాజమహేంద్రవరం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): పోలవరం భూసేకరణ (ఆర్అండ్ఆర్) ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా ఐఏఎస్ అధికారి వి.అభిషేక్ నియమితులయ్యారు. ఆయన ఇంతవరకూ పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసరుగా పనిచేశారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

బంగారం కోసం బలి తీసుకున్నాడు!

మహిళ అనుమానాస్పద మృతి

మిస్టరీని ఛేదించిన పోలీసులు

నిందితుడి అరెస్టు


మరణించిన మహాలక్ష్మి (ఫైల్‌ఫొటో)

ద్రాక్షారామ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం తోటపేటలో మహిళ అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ వీడింది. బంగారం కోసం మహిళను గొంతు నులిమి హత్య చేసినట్టు దర్యాప్తులో పోలీసులు తేల్చారు. సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తోటపేటకు చెందిన దామిశెట్టి మహాలక్ష్మి అలియాస్ ఇడ్లీ లక్ష్మి(54) తోట త్రిమూర్తులు కాలనీలో ఒంటరిగా నివసిస్తున్నది. ఈనెల 12న ఇంట్లో ఆమె మరణించింది. ఈ మరణంపై అనుమానం రాకపోవడంతో బంధువులు ఆమె మృతదేహాన్ని క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ద్రాక్షారామ శ్మశానవాటికలో పూడ్చిపెట్టారు. ఇంట్లో ఆమె బంగారు వస్తువులు కనిపించకపోవడంతో అల్లుడు, బంధువులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తీయించి పోస్టుమార్టం జరిపారు. అనంతరం కేసు విచారణ చేపట్టారు. తోటపేటకు చెందిన నాగిరెడ్డి అప్పారావు అలియాస్ బాబి ఆమెను హత్య చేసి బంగారం గొలుసు, వేలికి ఉంగరం తీసుకెవెళ్లినట్టు దర్యాప్తులో తేల్చారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చి రిమాండుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

పట్టించిన బంగారు వస్తువులు

ఈ హత్యకేసులో నిందితుడిని బంగారు వస్తువులు పట్టిచ్చాయి. ఆమె మృతిపై తొలుత అనుమానం రాకపోవడంతో బంధువులు అంత్యక్రియలు చేశారు. తదుపరి బంగారు వస్తువుల కోసం వెతకగా కనిపించలేదు. దీంతో ఆమె అల్లుడు, బంధువులు మహాలక్ష్మి పనిచేసే స్టీలు హౌస్‌కు వెళ్లి వాకబు చేశారు. ఈనెల 11న బంగారు వస్తువులు వేసుకుని ఆమె పనికి వచ్చినట్టు స్టీలు హౌస్ యజమాని తెలిపారు. దీంతో అనుమానం మరింత బలపడింది. బంగారు వస్తువుల ఫొటోలతో తాకట్టు దుకాణాల వద్దకు వెళ్లి విచారించారు. ద్రాక్షారామలోని ఒక బంగారం షాపు వద్ద నిందితుడు అప్పారావు తాకట్టు పెట్టినట్టు తేలింది. దీంతో ఆమె అల్లుడు సురేష్ తన అత్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల విచారణతో మిస్టరీ వీడింది.

'అన్నవరం' ఖజానాకు రూ.81.84 లక్షలు

దేవస్థానంలో ఫొటోలు తీసుకునే లైసెన్స్‌కు టెండర్ కం బహిరంగవేలం

అన్నవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో దర్శనం, వ్రతమాచరించుకునే భక్తులకు, పోలరైడ్ ఫొటోలు తీసుకునే లైసెన్స్ హక్కు ద్వారా స్వామివారి ఖజానాకు ఏడాదికి రూ.81.84 లక్షలు ఆదాయం దక్కనుంది. సోమవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగవేలం నిర్వహించగా నెలకు రూ.6.82 లక్షలు దేవస్థానానికి చెల్లించేందుకు గుత్తేదారు ముందుకొచ్చారు. ఇదే లైసెన్స్ హక్కుకు గతేడాది రూ.53.40 లక్షలు ఆదాయం లభించింది. పోలరైడ్ ఫొటోలు లైసెన్స్ ద్వారా రికార్డుస్థాయి ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. వీటితోపాటుగా వివిధ ప్రాంతాల్లో టీ, కాఫీ విక్రయించేందుకు రెండు దుకాణాలకు వేలం నిర్వహించగా ఏడాదికి ఒకషాపునకు రూ.3లక్షలు, మరో షాపునకు రూ.3.48 లక్షలు హెచ్చుపాటలు వెళ్లినట్లు దేవస్థానం లీజుల విభాగం అధికారులు తెలిపారు.

మాజీ మంత్రి పితాని పూజలు

అన్నవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


వేదాశీర్వచనం అందుకుంటున్న పితాని

త్రుటిలో తప్పిన ప్రమాదం

పంట పొలంలోకి దూసుకుపోయిన ఓల్వా బస్

50 మంది ప్రయాణికులు సురక్షితం



పొలంలోకి దూసుకుపోయిన బస్

ప్రత్తిపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై సోమవారం పంట పొలంలోకి ఓల్వా బస్సు దూసుకువెళ్లింది. స్థానిక బైపాస్ రహదారిలో విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే ఓల్వా బస్సు అదుపు తప్పి పంట పొలంలోకి దూసుకువెళ్లింది. బస్సులో 50 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో త్రుటిలో ప్రమాదం తప్పినట్టు అయింది. టైర్ పంక్చర్ అవడం వల్లే బస్సు అదుపు తప్పిందని స్థానికులు తెలిపారు. దీంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి


గింజాల బాల (ఫైల్)

కొత్తపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా మూలపేటలో సోమవారం జరిగింది. స్థానిక ప్రకాష్‌నగర్‌కు చెందిన రాచపల్లి ప్రసాద్ అదే గ్రామానికి చెందిన గింజాల బాల(25)ను 8 ఏళ్ల కిందట ప్రేమవివాహం చేసుకున్నాడు. ఇటీవల ప్రసాద్ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో తరచూ గొడవలు జరిగేవని బాలతల్లి గింజాల లక్ష్మి తెలిపింది. తన కుమార్తెను వదిలించుకోవాలనే ఉద్దేశ్యంతో అత్తింటివారే హత్య చేసి మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టారని కొత్తపల్లి పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రావులపాలెం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రావులపాడు జాతీయ రహదారి వంతెన సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... 30ఏళ్ల పైబడి ఉన్న పురుష మృతదేహంపై ఎరుపు రంగు షర్ట్, లేత గోధుమరంగు కాటన్ ప్యాంట్ ఉన్నాయి. చనిపోయిన వ్యక్తి లారీ క్లీనర్ గాని డ్రైవర్ అయి ఉండవచ్చని తెలిపారు. మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి బంధువులు గుర్తుపట్టేందుకు మార్చురీలో ఉంచినట్టు పోలీసులు చెప్పారు.


రావులపాడు వద్ద పోలీసులు గుర్తించిన మృతదేహం

అవినీతి కేసులో పోర్టు అధికారికి జైలు శిక్ష, జరిమానా

కాకినాడ క్రైం/రాజమహేంద్రవరం సిటీ జనవరి 20(ఆంధ్రజ్యోతి): అవినీతి కేసులో గతంలో పోర్టు ఆఫీసర్‌గా పనిచేసిన మనం వెంకట కృష్ణమోహన్‌కు రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు రెండేళ్ల జైలు శిక్షవిధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ ఐ.సతీష్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన షేక్ అహ్మద్ అలీషాకు కాకినాడ పోర్టు ఏరియాలో స్థలాన్ని కేటాయించి బార్జి మరమ్మతుల కోసం అనుమతిని జారీ చేసేందుకు మనం వెంకట కృష్ణమోహన్ 2009 జూన్ 15న రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు ట్రాప్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో కృష్ణమోహన్ నేరం చేసినట్టు రుజువు కావడంతో రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు న్యాయమూర్తి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి అవినీతి నిరోధక చట్టం 1988 సెక్షన్ 7 ప్రకారం ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమాన, యూ/ఎస్ 13(1)(డి) అవినీతి నిరోధక చట్టం ప్రకారం 2 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయబడతాయని తెలిపారు. ఈ కేసులో పీపీ ఎంవీ దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు. కేసును ప్రస్తుత డీఎస్పీ దర్యాప్తు చేశారు. ఇన్‌చార్జి అడిషనల్ ఎస్పీ(ఏసీబీ) వి.సుబ్బరాజు, డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.

యువతి మృతికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): యువతి మృతికి కారకుడైన వ్యక్తికి న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం పదో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ ఎస్సీఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే 2015లో గోకవరం గ్రామానికి చెందిన యువతి స్వాతిని పిల్లి ఆనంద్‌బాబు ప్రేమిస్తున్నానని వెంటబడి శారీరకంగా ఇబ్బంది పెట్టేవాడు. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. దీంతో ఆనంద్‌బాబుపై పలు సెక్షన్ల కింద ఎస్ఐ ఆర్.శివాజీ కేసు నమోదు చేయగా నార్త్ జోన్ డీఎస్పీ ప్రసన్నకుమార్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.6 వేలు చొప్పున జరిమాన విధించారు. ఈ కేసులో ఇతర నిందితులైన ఏ2, ఏ3లపై అభియోగాలను కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో స్పెషల్ ఏపీపీలు ఐ.వెంకటరత్నం, కె.రాధాకృష్ణరాజు వాదనలు వినిపించారు.

పండక్కి వచ్చి తిరిగెళ్తూ అనంతలోకాలకు..

» గురజాడలో డివైడర్‌ను ఢీకొన్న బైక్

» తీవ్రగాయాలతో ఇద్దరు యువకులు మృతి

» మృతులది కాకినాడ జిల్లా


ఘటనా స్థలంలో నాగవీరభద్ర దుర్గ మృతదేహం

పమిడిముక్కల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపి తిరిగి హైదరాబాద్ వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటన విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగింది. పమిడిముక్కల పోలీసుల కథనం ప్రకారం... కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన ముక్తా నాగవీరభద్ర దుర్గ(20), పిఠాపురానికి చెందిన దాసరి నిమ్మి చంద్ర(21) హైదరాబాద్‌లో ఉంటూ సంక్రాంతికి స్వస్థలానికి వచ్చారు. పండగ సెలవులు ముగియడంతో ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌పై హైదరాబాద్ బయలుదేరారు. అయితే వారు ప్రయాణిస్తున్న బైక్ పమిడి ముక్కల మండలం గురజాడ సమీపంలో హైవేపై ఫ్లైఓవర్ డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నాగ వీరభద్ర దుర్గ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన చంద్ర విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కన్ను మూశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంటబోదెలో ద్విచక్రవాహనం పడి వ్యక్తి మృతి

ద్రాక్షారామ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట వద్ద సోమవారం ఉదయం ద్విచక్రవాహనం అదుపు తప్పి పంటబోదెలో పడిపోవడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెలంపాలెం గ్రామానికి చెం దిన కోటిపల్లి జ్యోతిబాబు(38)వెల్డింగు పనిచేస్తుంటాడు. సోమవారం ఉదయం పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో జ్యోతిబాబు వాహనంతోపాటు బోదెలో పడిపోయినట్లుగా అతడి భార్యకు ఫోన్‌ద్వారా సమచారం అందింది. బంధువులతో కలసి వెళ్లి 108 అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. ద్రాక్షారామ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు..

కాకినాడ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన కాకినాడలో జరిగింది. స్థానిక దుమ్ములపేటకు చెందిన దోని గంగరాజు (46) చేపల వేట చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూంటాడు. ఈనెల 18న స్థానిక కుంభాభిషేకం రేవు నుంచి నాటు పడవపై వేటకు వెళ్లాడు. రాత్రి అయినా వేట నుంచి ఇంటికి రాకపోయే సరికి అతడి భార్య సింహాద్రి బంధువులతో కలసి తీరప్రాంతంలో గాలింపు చేపట్టింది. ఆచూకీ కానరాలేదు. దీంతో పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే ఆదివారం సాయంత్రం సముద్రంలో గంగరాజు విగతజీవిగా తేలియాడాడు. అనంతరం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోర్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మడ అడవులను సందర్శించిన ఎఫ్ఆర్‌వో శిక్షకులు

తాళ్లరేవు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఫారెస్ట్ ఎఫ్ఆర్‌వో శిక్షకులు 34మంది కోరింగ అభయారణ్యంలో మడఅడవులను సోమవారం సందర్శించారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షకులకు మడఅడవుల విశిష్టత, వన్యప్రాణుల ప్రాధాన్యత, అడవులో సంచరించే జీవజాతుల వివరాలు తెలియజేశారు. డిప్యూటీ డీఎఫ్‌వో విశాహు, ఎఫ్ఎస్‌వో కె.సిద్దార్థ, ఎఫ్‌బివోలు మహేష్, గోపి నాగేంద్ర, మధు, సంధ్యారాణి,ధనలక్ష్మి ఉన్నారు.


జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

ఏడీబీ రహదారిలో భారీ అగ్నిప్రమాదం

సుమారు 40 అడుగుల పైబడి మంటలు


ఎగసిపడుతున్న మంటలు

పెద్దాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రహదారిలో స్థానిక వాలుతిమ్మాపురం జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ సామగ్రి దగ్ధమైంది. సమీపంలో ఉన్న ఓ పరిశ్రమ ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాస్టిక్ సామగ్రిని ప్రమాదం జరిగిన ప్రదేశంలో డంపింగ్ చేసింది. కాల్చిపారవేసిన సిగరెట్ కారణంగా వ్యర్థాలకు నిప్పు అంటుకుని మంటలు ఎగసిపడినట్టు తెలుస్తోంది. సుమారు 40 అడుగుల పైబడి మంటలు ఎగసిపడ్డాయి. భారీగా పొగ కమ్మే యడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సమీపంలోనే పెట్రోలు బంకు ఉండడంతో మరింత ఆందోళన కలిగించింది. సమాచారం అందుకున్న పెద్దాపురం అగ్నిమాపకసిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పెద్దాపురంతో పాటు జగ్గంపేట, ప్రత్తిపాడు, కాకినాడ నుంచి అగ్నిమాపక శకటాలు చేరుకుని మంటలు అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది శ్రమించారు. ఈ ప్రమాదంలో రూ.లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తూ జరిగిందా లేక ఆర్థిక ప్రయోజనాలు ఆశించి ప్లాస్టిక్ సామాగ్రికి నిప్పు పెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అగ్నిమమాపక సిబ్బంది ఎంత మేరకు నష్టం వాటిల్లిందో అంచనా వేస్తున్నారు.

ఎంసీపీసీతో కేసుల సత్వర పరిష్కారం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ) ఆధ్వర్యంలో కేసుల సత్వర పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా కోర్టు డీఎల్ఎస్ఏ మందిరంలో సోమవారం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని జ్యుడీషియల్ అధికారులకు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వ కాన్సెప్ట్ అండ్ టెక్నిక్‌లపై శిక్షణ నిర్వహించారు. న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ సోమవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఎంసీపీసీ యాక్ట్ ప్రకారం 2023 ప్రొవిజన్ ప్రకారం జ్యూడిషియల్ అధికారులు, న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. హైకోర్టు సూచనల మేరకు జ్యూడిషియల్ అధికారులు, న్యాయవాదులను నామినేట్ చేసి కేసులను పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుతుందన్నారు. శిక్షణలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయిత్రిదేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, సీనియర్ శిక్షకులు సురీందర్ సింగ్(ఢిల్లీ),ఎస్.అరుణాచలం (తమిళనాడు),అధికారులు, న్యాయవాదులు ఉన్నారు.

తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై మాజీ ఎంపీ హర్షకుమార్ ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీటీడీ పాలక మండలి, ఈవో, జేఏవోలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం స్టేషన్‌కు వెళ్లిన ఆయన తన ఫిర్యాదును పోలీసులకు అందించి రసీదు పొందారు. తొక్కిసలాటలో ఆరుగురు మరణానికి కారకులుగా టీటీడీ చైర్మన్, ఈవో, జేఈవోపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు.

విశ్వేశ్వరాయపురంలో పశు వైద్య శిబిరం

మలికిపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురంలో పశు వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. సర్పంచ్ చెల్లుబోయిన హెలీన శిబిరాన్ని ప్రారంభించగా 65 పశువులకు గర్భకోశ వ్యాధులకు, నట్టల నివారణకు చికిత్స చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ పి.సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు రక్షించుకోవాలని ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు సూచించారు. సోమవారం రామచంద్రపురం రాజగోపాల్ సెంటర్‌లో రహదారి భద్రతా వారోత్సవాలు పురస్కరించుకుని వాహనాలు తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు వివరించారు.

సహకార ఉద్యోగుల హెచ్‌ఆర్ పాలసీ అమలెప్పుడు!

● సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట సహకార ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

అమలాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తామని జీవోను విడుదల చేసి ఐదేళ్లు గడిచిపోయినా ఇంతవరకు అమలుకు నోచుకోలేదని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ఆరోపించారు. జీవో అమలు కోసం ఇంకెంత కాలం పోరాటాలు చేయాలని ప్రశ్నించారు. సహకార ఉద్యోగులు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ధర్నా శిబిరాన్ని ఐవీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉద్యోగ వయో పరిమితిని పెంచాలని, జీవో నంబరు 36ను ఎటువంటి షరతులు లేకుండా అమలు చేయాలని, 2019 వేతన సవరణ చేయాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నినాదాలతో హోరెత్తించారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు యూనియన్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఐవీ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేడిచర్ల రామలింగేశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శులు కుంపట్ల అయ్యప్పనాయుడు, మట్టపర్తి జయరామ్, కె.శ్రీనివాసరాజు, తోరం దొరాజీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు

● జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు



అమలాపురం: చిందాడగరువులో ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ వెంకట్రావు

అమలాపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు తెలిపారు. జిల్లాలో పశు సంపదను పెంచడంతో పాటు వాటి ఆరోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బంది ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారని వివరించారు. చిందాడగరువులో పశు వైద్యాధికారి డాక్టర్ పూర్ణిమ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి, సర్పంచ్ పొణకల గణేష్‌తో కలిసి డాక్టర్ వెంకట్రావు ప్రారంభించారు. ఈనెల31వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు చూడికట్టు శాతం పెంచేందుకు నట్టల నివారణ మందు పంపిణీ వంటి కార్యక్రమాలు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు వివరించారు. నట్టల నివారణా మందు తాగించడం వల్ల పాల ఉత్పత్తి, పునరుత్పత్తి శక్తి పెరిగి రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ విజయారెడ్డి వివరించారు. మోటూరి వెంకటేశ్వరరావు, పశువైద్య సహాయకులు రమణ, మోహన్, మౌనిక, సురేష్ పాల్గొన్నారు.

పశువుల కోసం ఆరోగ్య శిబిరాలు

అల్లవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పశు సంరక్షణకు ఆరోగ్య శిబిరాలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కొమ్ము వెంకట్రావు అన్నారు. సోమవారం కోడూరుపాడులో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని టీడీపీ సీనియర్ నేత సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు ప్రారంభించారు. పశువుల్లో నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, రైతులకు అవగాహన సదస్సులు కల్పిస్తున్నామన్నారు. సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి మాట్లాడుతూ బహువార్షిక పశుగ్రాసాల పెంపకం, పశుకిసాన్ క్రెడిట్ కార్డులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ మేడిద నారాయణరావు, చింతా శ్రీనివాస్, పాడి రైతులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజోలు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కేతా శ్రీను కోరారు. తాటిపాకలో పశు వైద్యశాల వద్ద ఉచిత పశు వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కేతా మాట్లాడుతూ ఈనెల31వరకు మండలంలో ఉన్న పశువైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల వద్ద పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. సహాయ సంచాలకుడు, పశువైద్య సహాయకులు, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చేస్తా: ఎమ్మెల్యే



మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు తాగునీటి సమస్య లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.31.70లక్షలతో గూడపల్లిలో నూతనంగా నిర్మించిన 40వేల లీటర్ల మంచినీటి వాటరు ట్యాంకును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొంది వంటి శివారు ప్రాంతాలకు రోజూ నీరిచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైసీపీ పాలనలో తాగునీటి పథకాలను నిర్లక్ష్యం చేశారని, గుడిమెళ్లంక మంచినీటి రిజర్వాయరుకు కనీసం రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని అన్ని మంచినీటి పథకాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందుకు ఓఎన్జీసీ సహకారం కూడా తీసుకుంటున్నట్టు తెలిపారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుందర శ్రీనివాస్, సర్పంచ్ సుందర బ్రహ్మయ్య, చాగంటి స్వామి, దిరిశాల బాలాజీ, పున్నం గంగారావు, కొణిదెల శ్రీనివాస్, కటికిరెడ్డి గోపాలకృష్ణ, సుందర బుల్లబ్బులు పాల్గొన్నారు.

ఆయిల్‌కంపెనీ లీజు సొమ్ములు విడుదల

కాట్రేనికోన, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉప్పూడిలో గతంలో పీహెచ్ఎస్ సంస్థ స్థలాన్ని బొబ్బిలి పాపారావు, మద్దింశెట్టి ఈశ్వరరావు, గొలకోటి నాగపార్వతిలీజుకు తీసుకుని చమురు వెలికితీత కార్యక్రమాలు చేపట్టారు. గ్యాస్ వెలికితీత సమయంలో బ్లోఅవుట్ సంభవించడంతో సదరు సంస్థ చేతులెత్తేసింది. అనంతరం ఎంపీ చొరవతో ఎల్ఎన్‌జీ భారత్ కంపెనీకి సబ్ లీజుకు ఇచ్చారు. సుమారు ఆరు సంవత్సరాల నుంచి లీజ్ పెండింగ్‌లో ఉంది. రంబాల దొరబాబు ఆధ్వర్యంలో పలుమార్లు ఎంపీ హరీష్‌ను కలిసి బాధితులు మొరపెట్టుకున్నారు. గతంలో ఈఅంశంపై ధర్నా కూడా జరిగింది. ఎంపీ హరీష్ ఓఎన్జీసీ అధికారులతో చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హరదీప్ సింగ్‌పూరిని కలిసి పరిస్థితిని వివరించారు. ఫలితంగా బాధితులకు రూ.15లక్షల లీజు సొమ్ము విడుదలైనట్టు దొరబాబు తెలిపారు. ఈవిషయంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కృషి ఎంతో ఉందన్నారు. కాగా గ్రామస్తులకు అందవలసిన పరిహారం విషయంలో కూడా ఎంపీ కృషి చేస్తున్నారని దొరబాబు వివరించారు.

స్వచ్ఛ తాగునీటిని అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే



వేగివారిపాలెంలో మహిళలకు నీళ్ల బిందెను అందజేస్తున్న ఎమ్మెల్యే దేవ, ఓఎన్జీసీ ఈడీ అసెట్ మేనేజర్ దాసు

రాజోలు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. వేగివారిపాలెం ఎస్సీ కాలనీలో ఓఎన్జీసీ నిధులు రూ.33.06లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన 60వేల లీటర్ల మంచినీటి ట్యాంకును, పొన్నమండలో కందికట్టువారి గ్రూపులో ఓఎన్జీసీ నిధులు రూ.33.21లక్షలతో నూతనంగా నిర్మించిన 90వేల లీటర్ల మంచినీటి ట్యాంకును ఎమ్మెల్యే దేవ, ఓఎన్జీసీ ఈడీ అసెట్ మేనేజర్ ఎస్.దాసు సోమవారం సంయుక్తంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ గుడిమెళ్లంక వాటరు స్కీముకు రూ.5కోట్లతో గతంలో ప్రపోజ్ చేసిన ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ (ఆర్ఎఫ్ఎస్)ను త్వరితగతిన మంజూరు చేయాలని ఓఎన్జీసీ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఓఎన్జీసీ అధికారులు అసెట్ సపోర్టు మేనేజర్ జి.శ్రీనివాస్, హెడ్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ జాన్‌వెస్లీ, హెచ్‌ఆర్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ కేతా శ్రీను, జడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్‌లు పప్పొప్పుల వెంకటలక్ష్మి, కుక్కల బేబికుమారి, రాజోలు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పట్టపగలు చోరీ

అమలాపురం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బియ్యం కావాలని వచ్చిన ఇద్దరు వ్యక్తులు వ్యాపారిని మాటల్లో పెట్టి రూ.50వేలు అపహరించుకుపోయిన సంఘటన సోమవారం అమలాపురం కేఎన్ఎఫ్ రోడ్డులో జరిగింది. బియ్యం వ్యాపారం చేసుకునే అరిగెల నాని షాపు తెరవగానే ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి మాటల్లో పెట్టి బ్యాగులో ఉన్న రూ.50వేలు నగదును అపహరించుకుపోయారు. అయితే అక్కడ సీసీ కెమెరాల్లో నమోదైన వివరాలను పట్టణ సీఐ పి.వీరబాబుకు అందజేశారు. ఈవ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రోడ్లపై గోవుల సంచారంతో ప్రమాదాలు



అంతర్వేది, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ప్రధాన రహదారుల వెంబడి గోవులు సంచరిస్తూ అడ్డంగా నిలుచుండిపోతుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా నాలుగు రోడ్ల కూడలిలో ఎక్కువగా గోవులు నిల్చుండడం, అడ్డంగా పడుకోవడంతో వాహనదారులు హార్న్ కొట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. కార్లలో ప్రయాణించేవారు డోర్ తీసుకుని వచ్చి వాటిని బెదిరించి ప్రయాణాలు సాగిస్తున్నారు. రోడ్లపై వెళ్లే ప్రయాణికులు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్లపై గోవులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలంటూ అంతర్వేది దేవస్థానానికి చెందిన గుర్రం సునీల్ అధికారులను కోరారు.

వాహన తనిఖీలు

అల్లవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి, హెల్మెట్‌లేకుండా వాహనాలు నడిపినా, ముగ్గురు ఒకే వాహనంపై ప్రయాణించినా చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్ఐ జి.హరీష్‌కుమార్ హెచ్చరించారు. భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం అల్లవరం హైస్కూలు సెంటర్‌లో ఎస్ఐ హరీష్ కుమార్ వాహనాలను తనిఖీచేశారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, హెల్మెట్టు లేకుండా వాహనాలను నడపవద్దని సూచించారు. ఏఎస్ఐ జంగా సత్యనారాయణ, సిబ్బందిపాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షాసమావేశం

ఐ.పోలవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీవీరేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో జరిగే మహాశివరాత్రి ఏర్పాట్లపై సోమవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఆలయ అర్చక, పురోహిత సిబ్బంది, గ్రామస్తులతో సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2వరకు ఉత్సవాలు జరగనున్నాయి. కోనసీమలోనే అతి పెద్ద శివాలయం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశముందన్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. మహాశివరాత్రి పర్వదినాన స్వామివారికి పుష్కరనదీ జలాలతో అభిషేకం జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మార్చి 2న రాత్రి మురమళ్ల పవిత్ర గోదావరి నదిలో తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

అమలాపురం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు చెప్పారు. అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణంలో సోమవారం రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. పట్టణ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు డ్రైవింగ్‌ను వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. హెల్మెట్‌లు ధరించడం వల్ల రహదారి ప్రమాదాల్లో ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు. ద్విచక్ర వాహనాలతో జరిగే ప్రమాదాల్లో ఎక్కువ శాతం హెల్మెట్ ధరించనివారే చనిపోతున్నారన్నారు. తండ్రి బయటికి వెళ్లినప్పుడు కాస్త ఆలస్యమైనా పర్వాలేదు నెమ్మదిగా ఇంటికి రావాలని సూచించాల్సిన బాధ్యత బిడ్డలైన విద్యార్థులపై ఉందన్నారు. సినిమా రోడ్డులో ఆదిత్య విద్యార్థులతో రహదారి భద్రతా నియమాలపై మానవహారం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, పోలీసులుపాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడి కేసులో విచారణ

యువకుడికి హర్షకుమార్ పరామర్శ



దళిత యువకుడిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ

అమలాపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం పసుపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు గంటి కిరణ్ ఏసీ రిపేరు నిమిత్తం అమలాపురం వచ్చాడు. స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వీధిలో మిర్చి బండి వద్ద ఆగిన కిరణ్‌పై స్థానిక నారాయణపేటకు చెందిన యువకులు దాడి చేశారు. గాయపడ్డ కిరణ్‌ను అమలాపురం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కోనసీమ దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబూరావు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, వీసీకే కార్యదర్శి బొంతు రమణ తదితరులు కిరణ్‌ను పరామర్శించారు. ఈఘటనపై విచారణ చేపట్టినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

మంత్రి సుభాష్‌కు స్వీట్ వార్నింగ్

అమలాపురంటౌన్, జనవరి20(ఆంధ్రజ్యోతి): మంత్రి వాసంశెట్టి సుభాష్ అనుచరుల దాడిలో గాయపడిన దళిత యువకుడిని ఏరియా ఆసుపత్రిలో సోమవారం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ పరామర్శించి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని బాధితుడి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ మంత్రి సుభాష్‌కు హర్షకుమార్ స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. భవిష్యత్‌లో ఎదగాలంటే మంత్రి సుభాష్ జాగ్రత్తగా ఉండాలని, రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తే ఊరుకునేదిలేదని వ్యాఖ్యానించారు. దళిత యువకుడిపై దాడికి పాల్పడ్డవారందరినీ తక్షణం అరెస్టు చెయ్యాలని, బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. బాధితుడిని పరామర్శించిన వారిలో ఇసుకపట్ల రఘుబాబు, జీవీ శ్రీరాజ్, పొలమూరి మోహన్‌బాబు, రేవు తిరుపతిరావు, నూకపెయ్యి చిన్న, గెద్దాడ బుద్ధరాజ్, కాట్రు వసంత్, బండి శ్రీరాములు, మోర్త సత్యనారాయణ, బడుగు జేమ్స్‌పాల్ తదితరులున్నారు.

అంతర్వేది ఉత్సవాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలి

అమలాపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. తీర్థం జరిగే ప్రాంతాల్లో మద్యం బెల్టు షాపులు, మాంసం విక్రయాలు, క్రైస్తవ మత ప్రచారాన్ని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్య, గుత్తుల సుగుణ, చిలకలపూడి రవి, పొన్నాల అర్జున్, చిలకలపూడి కృష్ణ, లంకే నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా పరిషత్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



పి.గన్నవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చిన్నవయస్సులోనే పెయింటింగ్‌లో ప్రతిభ కనబరిచి తండ్రి బాటలోనే నడుస్తున్నారు ఆ చిన్నారులు. నాగుల్లంక గ్రామానికి చెందిన మానేపల్లి బాలుర ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ విజయకుమార్ కుమార్తె టి.చరిష్మ, కుమారుడు టి.తనోజ్‌కుమార్ అమలాపురంలో జరిగిన కోనసీమ చిత్రకళ పరిషత్ బాలల స్పాట్‌పెయింటింగ్ జూనియర్స్‌లో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించారు. ప్రైవేటు పాఠశాలలో 6వతరగతి చదువుతోన్న తనోజ్‌కుమార్ ప్రథమ, 8వ తరగతి చదువుతోన్న చరిష్మ మూడో స్థానం సాధించారు.

రెబల్‌స్టార్ కృష్ణంరాజు జయంతి

అమలాపురం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, రెబల్‌స్టార్ ఉప్పలపాటి కృష్ణంరాజు జయంతి వేడుకలను సోమవారం అమలాపురం టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్యనారాయణరాజు (సత్తిబాబురాజు), రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కర్రి రామస్వామి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్ ఆధ్వర్యంలో కృష్ణంరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినిమా రంగంలో ఎన్నో విజయాలు సాధించిన కృష్ణంరాజు రాజకీయ రంగంలో కేంద్ర మంత్రిగా పనిచేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని వక్తలు కొనియాడారు. పట్టణశాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, వలవల శివరావు పాల్గొన్నారు.

సత్యనారాయణమ్మ మృతికి సంతాపం

అంబాజీపేట, జనవరి20(ఆంధ్రజ్యోతి): మాచవరంలో బొర్రా సత్యనారాయణమ్మ ఇటీవలమృతిచెందారు. పలువురు సంతాపం తెలిపారు. సత్యనారాయణమ్మ చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. సత్యనారాయణమ్మ కుమారులు వీర్రాజు, వెంకన్నబాబు, రామచంద్రరావు, నరసింహమూర్తి, రమేష్, సత్యఅప్పారావు, సూర్యచంద్రరావు, గణపతిలను పరామర్శించి ఓదార్చారు. నాయకులు విత్తనాల శేఖర్, ముత్యాబత్తుల ప్రశాంత్ వాసంశెట్టి వెంకన్న, ఉందుర్తి నాగబాబు, మట్టపర్తి హరి పరామర్శించారు.

కుష్టు వ్యాధి బాధితులకు మెరుగైన వైద్య సేవలు

అంబాజీపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి కుష్టు వ్యాధి బాధితులను గుర్తిస్తామని సీహెచ్‌వో బి.అప్పారావు తెలిపారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న కుష్టు వ్యాధి బాధితులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు, పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే

మామిడికుదురు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధిపై మండలంలోని ఇంటింటికీ వెళ్లి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సోమవారం నుంచి సర్వే చేస్తున్నారు. నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్వే చేపట్టారు. గ్రామాల్లో ప్రతీ ఒక్కరికీ ఆశ, ఏఎన్ఎంలు పరీక్షించి అనుమానిత కేసులను దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రిఫర్ చేయనున్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది గ్రామాల్లో కుష్టువ్యాధి లక్షణాల గురించి వివరిస్తూ అటువంటి లక్షణాలు ఎవరికైనా ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

ఓటు విలువపై వ్యాసరచన పోటీలు

అయినవిల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఈనెల25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకని మండలంలోని 9, 10, 11 తరగతులు చదువుతోన్న విద్యార్థులకు మండల స్థాయిలో ప్రజాస్వామ్యంలో ఓటు విలువ అనే అంశంపై వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి పెచ్చెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పదం మంజుశ్రీ ప్రథమ, కొండుకుదురు ఉన్నత పాఠశాల విద్యార్థి వైఎస్ఎల్ తేజస్విని ద్వితీయ స్థానాలు సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఎంఈవో తెలిపారు. వీరికి గైడ్ టీచర్లగా జి.సాయిశ్రీనివాస్, డి.రామారావు వ్యవహరిస్తారు.

ఎంఈవో-1గా గౌరీశంకర్



ముమ్మిడివరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండల విద్యాశాఖ అధికారి-1గా డి.గౌరీశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం మండలం నల్లవంతెన ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న గౌరీశంకర్ ఎంఈవో-1గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన బొజ్జా రమణశ్రీ ఉద్యోగ విరమణ చేశారు. గౌరీశంకర్‌కు ఎంఈవో-2 ఆర్.ఉదయభాస్కర్, మండల వనరుల కేంద్రం సిబ్బంది, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో సత్కరించి స్వాగతం పలికారు.

క్రీడల్లో రాణించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు

మామిడికుదురు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ విశ్రాంత జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మామిడికుదురులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 50మంది క్రీడాకారులకు విశ్రాంత అధికారి క్రీడా దుస్తులను సమకూర్చి సోమవారం పంపిణీ చేశారు. దాతను హెచ్‌ఎం సీహెచ్ నిరంజని, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు వాసంశెట్టి వెంకట్రావు, పీడీ మట్టా శ్రీధర్, బి.సత్యనారాయణ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు పలు ఫిర్యాదులు

అంబాజీపేట, జనవరి20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పలు ఫిర్యాదు వచ్చినట్లు ఎంపీడీవో జీవీ సరోవరరావు తెలిపారు. మాచవరం 16వవార్డు కందుల మల్లేశ్వరస్వామి ఆలయవీధిలో డ్రైనేజీ పూడుకుపోయి రోడ్డుపై నీరు వచ్చి దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. పింఛన్ కోసం ఒక దరఖాస్తు వచ్చిందన్నారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా దొరబాబు నామినేషన్



అమలాపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లాశాఖ అధ్యక్ష, ఎన్నికల ప్రక్రియ స్థానిక జిల్లా కార్యాలయంలో సోమవారం చేపట్టారు. ఎన్నికల అధికారిగా పెద్దిరెడ్డి రవికిరణ్, పరిశీలకునిగా ఏవీఆర్ చౌదరి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న యాళ్ల వెంకటరామ్మోహనరావు (దొరబాబు) మరోసారి జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారికి సమర్పించారు. పార్టీ నాయకులు పాలూరి సత్యానందం, చిట్టూరి రాజేశ్వరి, యిళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవార్ల జాతర



కంఠాభరణం బహూకరిస్తున్న దంగేటి శ్రీహరి, రంగనాథ్

ఉప్పలగుప్తం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చల్లపల్లిలో గొలకోటి, దంగేటి, పోలిశెట్టి వంశీయుల ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్న మహిషమ్మ, కనకమహాలక్ష్మి, మరిడిమహాలక్ష్మి అమ్మవార్ల జాతరలు ముగిశాయి. ముగ్గురు దేవతలను అక్కాచెల్లెళ్లుగా భావించి ఏటా పుట్టింటికి తీసుకువచ్చి, జాతరల అనంతరం సాగనంపుతారు. సోమవారం ఆనవాయితీ ప్రకారం గొలకోటి వంశీయులు అమ్మవార్లకు వడికట్టు కట్టారు. అనంతరం ఊరంతా కలిసి అమ్మవార్లను సాగనంపారు. మహిషాసురమర్దని అమ్మవారికి చల్లపల్లికి చెందిన దంగేటి శ్రీహరి, రంగనాథ్ కంఠాభరణం బహూకరించారు.

శ్రీనివాసరావును సత్కరించిన వైసీపీ నేతలు

అంబాజీపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన అయినవిల్లి జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావును వైసీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. వైసీపీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఆధ్వర్యంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నాయకులు పేరి శ్రీను, కొర్లపాటి కోటబాబు, దొమ్మేటి సత్యమోహన్, ఉందుర్తి నాగబాబు సత్కరించారు.

చిత్రకళా పోటీల్లో 25మందికి స్వర్ణ పతకాలు



స్వర్ణ పతకాలు సాధించిన పాలగుమ్మి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

అమలాపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల చిత్రలేఖనం వండర్ ఆర్ట్స్ వరల్డ్ పోటీల్లో పాలగుమ్మి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటి 25మంది స్వర్ణ పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు గుంట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులను, ప్రోత్సహించిన చిత్రలేఖనం ఉపాధ్యాయులు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్‌ను సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. చంద్రకుమార్‌కు విశిష్ట ఆచార్య పురస్కారం అవార్డును చిత్రకళా పరిషత్ అందజేసింది.

సామాజిక భవనాన్ని అభివృద్ధి చేస్తాం

మలికిపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ప్రభుత్వపరంగా అన్ని పథకాలు అమలు చేయడానికి కృషి చేస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అడివిపాలెంలో అసంపూర్తిగా ఉన్న చేనేత కార్మికుల సామాజిక భవనం పనులను సోమవారం ఆయన పునః ప్రారంభించారు. కొల్లు నరసింహస్వామి, చింతా వీరభద్రేశ్వరరావు, దిరిశాల బాలాజీ, గుండుబోగుల పెద్దకాపు, స్థానికనాయకులు పాల్గొన్నారు.

గోడిలో విద్యుత్ ప్రమాదంపై రాష్ట్ర మానవహక్కుల వేదిక నిజనిర్ధారణ



గోడిలో మానవహక్కుల వేదిక రాష్ట్ర నేత వై.రాజేష్ బృందం నిజనిర్ధారణ

అల్లవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గోడి కొత్తకాలనీలో విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కేతా లాస్యమాధురి, తల్లి రమాదేవిల ప్రమాద సంఘటనపై రాష్ట్ర మానవహక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ సోమవారం నిజనిర్ధారణ చేపట్టారు. ఐదేళ్ల బాలిక లాస్యమాధురి చేతిని శస్త్రచికిత్స చేసి తొలగించగా రక్షించబోయి తీవ్రంగా గాయపడ్డ తల్లిరమాదేవి ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. బాలిక తండ్రి దివ్యాంగుడు కావడంతో తల్లే కుటుంబాన్ని పోషిస్తుందని, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని నిర్ధారించారు. విద్యుత్ ప్రమాదంపై అల్లవరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనా బాధ్యులపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. బాధితులకు ఆర్థికసాయం అందలేదన్నారు. ఆ కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని మానవహక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఈనిజనిర్ధారణలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఇక్బాల్, నామాడి శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద బాధితులకు దెందుకూరి పరామర్శ

అల్లవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గోడి కొత్తకాలనీలో విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చేయిని కోల్పోయిన కేతా లాస్యమాధురి, గాయపడ్డ తల్లి రమాదేవి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు సోమవారం పరామర్శించారు. బాధితులకు దెందుకూరి రూ.10వేలు అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కడలి అచ్యుతం, తోట నరసింహారావు, కాంగ్రేగుల వెంకటసత్యనారాయణ, కడలి రామసత్యనారాయణ, బొంతు రెడ్డి, కాంగ్రేగుల ప్రసాద్ బాధితులను పరామర్శించారు. ఈఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్‌శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ బిల్డింగ్ వర్కర్స్ కన్వీనర్ ఆకుల వీరబాబు డిమాండు చేశారు. బాధిత కుటుంబానికి రూ.10లక్షలు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు.

రక్తపింజరి హతం

అల్లవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గుండెపూడి పోతులవారిపేటలో ప్రమాదకరమైన రక్తపింజరి నాగుపాముతో ప్రజలు బెంబేలెత్తారు. రక్తపింజరి కరిస్తే వెంటనే చనిపోతారని గుర్తించి స్థానికులు ఆ పామును చంపేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై కరపత్రాల పంపిణీ

యానాం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం యానాం శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు ఆధ్వర్యంలో యానాం ప్రధాన కూడలి వద్ద విద్యార్థులు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

కొత్తపేట ఎమ్మెల్యే బండారు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పలు శాఖల అభివృద్ధి పనులపై అధికారులతో సమావేశం జరిపారు. రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాల అభివృద్ధి అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు బండారు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

కిటకిటలాడిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,02,799 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. బుధవారంనాడు స్వామివారి హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు.

వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలి

రావులపాలెం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈతకోట టోల్‌గేట్ వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా జరిపిన సమావేశంలో ఎంవీఐ మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది, టోల్‌గేట్ సిబ్బంది పాల్గొన్నారు.



ఈతకోట టోల్‌గేట్ వద్ద రక్తదానం చేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగేశ్వరరావు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 20(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించినట్టయితే ప్రాణాలకు ముప్పు ఉండదని ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు సూచించారు. సోమవారం రాజగోపాల్ సెంటర్‌లో రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటోడ్రైవర్లు, ద్విచక్రవాహనరులు పాల్గొన్నారు.

నిర్మాణం దశలో గోకులం షెడ్లు

ఆత్రేయపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మినీ గోకులాలు నిర్మించి పశుపోషణకు ప్రభుత్వం మెరుగైన చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకంలో ఈ గోకులాలు నిర్మాణంలో ఉన్నాయి. ముఖ్యంగా ఆత్రేయపురం మండలంలో 17 గ్రామాల్లో 60 దరఖాస్తులు సమర్పించగా 47 యూనిట్లు మంజూరు చేశారు. దీంతో రూ.1.08 కోట్లతో షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పదమూడు గోకులాలు పూర్తవడంతో ప్రారంభమయ్యాయి. నిర్మాణ దశలో 24 ఉండగా, 10 ప్రారంభ దశలో ఉన్నాయి. షెడ్ల నిర్మాణానికి ఉపాధి అధికారులు చర్యలు చేపట్టారు.



లొల్లలో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్

న్యాయం చేయాలని రోడ్డుపై మృతదేహంతో ధర్నా



వి.సావరం-రాయవరం రోడ్డుపై మృతదేహంతో ధర్నా నిర్వహిస్తున్న బంధువులు

రాయవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం రాత్రి రాయవరం-వి.సావరం రోడ్డులో మృతదేహంతో ధర్నా చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని వి.సావరం గ్రామానికి చెందిన వెలుపూడి రమణ(50) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 19న రాత్రి బయటకు వెళ్లి బైక్‌పై వి.సావరం వస్తున్నాడు. ఈ నేపథ్యంలో రాయవరం ప్రధాన రహదారిలోని వి.సావరం మలుపు సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ రమణను ఢీకొనడంతో గాయపడ్డాడు. తొలుత ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్సకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా మృతి చెందాడు. కాకినాడ నుంచి రమణ మృతదేహన్ని తీసుకు వచ్చే క్రమంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు రాయవరం ప్రధాన రహదారిలో వి.సావరం మలుపు వద్ద ధర్నా చేపట్టారు. ట్రాఫిక్ స్తంభించి పోవడంతో విషయం తెలుసుకున్న రాయవరం ఎస్ఐ డి. సురేష్ బాబు, మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పరిస్థితిని సమీక్షించి మృతుడి బంధువులతో చర్చలు జరిపారు. న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. రమణకు భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ఆత్రేయపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలీ జడ్పీ హైస్కూల్‌లో 1974-75లో చదువుకున్న విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. చదువుకున్న పాఠశాలలో 50 వసంతాల వేడుకలు జరుపుకుని తమకు చదువు చెప్పిన గురువులను వారు సత్కరించారు. పూర్వ విద్యార్థి ఉత్తమ సేవా కార్యక్రమాలు చేపడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి అవార్డు అందుకున్న గోటేటి మోహన్‌ను పలువురు సత్కరించారు. అనంతరం వారంతా విందు భోజనం చేశారు. కార్యక్రమంలో పి.సత్యనారాయణరాజు, సత్తి వెంకట సత్యనారాయణరెడ్డి, నీలావతి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలి జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

నేడు మండల సమావేశం

ఆలమూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 21న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు.

లాకులు కూలుతున్నా పట్టించుకోరా?

• నిర్లక్ష్యం చూపిన గత ప్రభుత్వం • వృథాగా పోతున్న సాగునీరు • కూటమి ప్రభుత్వం పట్టించుకోవాలని రైతుల వినతి

ఆలమూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో సాగునీటి కాలువకు నీరందించే లాకుల నిర్వహణ శిథిలావస్థకు చేరుతున్నాయి. కొత్త నిర్మాణాల మాటెలా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఉన్న లాకుల నిర్మాణం చేపట్టి దాదాపు 150 ఏళ్లు అవుతోంది. ఇప్పటికీ అవే లాకులపై ఆధారపడి సాగునీరు అందుతోంది. ఆలమూరు లో 125 ఏళ్ల క్రితం నిర్మించిన ఇరిగేషన్ రవాణా కోసం అప్పట్లో నిర్మించిన నేవిగేషన్ పూర్తిగా కుప్పకూలింది. నేవిగేషన్ లాకులు కూలిపోయి రెండేళ్లు పైబడినప్పటికీ వాటిని పునర్నిర్మించే ఆలోచన చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. వీటి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినప్పటికీ అప్పట్లో నిధుల కొరత కారణంగా వాటిని అలానే వదిలేశారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో ప్రధాన లాకులకు కూడా ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం అవు తోంది. నేవిగేషన్‌కు ఉన్న తలుపులు పూర్తిగా శిథిలమై పోవడంతో లాకుల వద్ద నీటిని అదుపు రాక పంట కాలువకు సాగునీరు అందించేందుకు ఇబ్బందిగా మారింది. ఈ తలుపు తుప్పు పటడంతో నీరుగారిపోయి లాకులపై నీటి నిల్వ చేయడానికి వీలు లేకుండా పోతోంది. అధికారులు, పాలకులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు ప్రత్యేక దృష్టిపెట్టి శిథిలమైపోతున్న లాకులను పటిష్ట పర్చాలని రైతులు కోరుతున్నారు.



ఆలమూరు ఇరిగేషన్ లాకుల వద్ద నేవిగేషన్ సిస్టం పనిచేయకపోవడంతో బయటకు వస్తున్న సాగునీరు

నలుగురికి సావిత్రిబాయి పూలే అవార్డులు

మండపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన నలుగురు ప్రైవేటు ఉపాధ్యాయినులకు జాతీయస్థాయి సావిత్రి బాయిపూలే అవార్డులు లభించాయి. ఎస్వీఎల్‌టీవో (విజయవాడ) ఆధ్వర్యంలో గుంటూరు విజ్ఞాన మందిరంలో ఈ అవార్డులు అందించారు. సంస్థ అధ్యక్షుడు పి.నాగయ్య, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అవార్డులు ప్రదానం చేశారు. మండపేట సెయింట్ జాన్స్‌లో హిందీ టీచర్ షేక్ ఫర్జానాబేగం, ఇంగ్లీష్ టీచర్ దాసరి నాగమణి, హిందీ పండిట్ ఎస్.గంగాభవానీ, నారాయణ వైస్ ప్రిన్సిపాల్ ఎం.సత్య అవార్డులు అందుకున్నారు. వీరికి అవార్డులు దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



కె.గంగవరంలో మంత్రి సుభాష్‌ను సన్మానిస్తున్న నాయకులు

మంత్రి సుభాష్‌కు ర్యాంకు రావడంపై హర్షాతిరేకాలు

కె.గంగవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ర్యాంకు రావడంపై కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లాలో ఎమ్మెల్యేలను, ఎంపీలను సమన్వయం చేసుకుంటూ జిల్లా అభివృద్ధిని ప్రగతి పథంలో నడిపించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించిన విషయం విదితమే. సోమవారం పార్టీ నాయకులు రవ్వా భూషణం, తోట వెంకన్న, మేడిశెట్టి వాడపల్లి తదితరులు మంత్రిని సన్మానించి అభినందనలు తెలిపారు.

ద్రాక్షారామ: కృష్ణాజిల్లా అన్ని విభాగాల్లో మొదటిస్థానం కైవసం చేసుకున్న నేపథ్యంలో ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న మంత్రి సుభాష్‌కు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఇటీవల సీఎం చంద్రబాబు సమీక్ష జరిపిన సందర్భంగా కృష్ణాజిల్లా పలు విభాగాల్లో మొదటిస్థానంలో ఉన్నట్టు చెప్పారు. దీంతో మంత్రి సుభాష్‌ను ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టీడీపీ నాయకుడు రవ్వా భూషణం తదితరులు సోమవారం ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద మంత్రి సుభాష్‌ను సత్కరించారు.



కొత్తపేట భవిత కేంద్రానికి టీవీ బహూకరిస్తున్న దాతలు

భవిత కేంద్రానికి టీవీ బహూకరణ

కొత్తపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కొత్తపేట గౌతమినగర్‌లో ప్రత్యేక అవసరాల భవిత కేంద్రానికి స్థానికులు మట్టపర్తి సత్యనారాయణ, శాంతకుమారి దంపతులు, కొప్పిశెట్టి శ్రీనివాసరావు కలిసి భవిత కేంద్ర చిన్నారులకు ఉపయోగపడేలా టీవీని బహూకరించారు. మండల విద్యాశాఖ అధికారి ఎం.హరిప్రసాద్‌కు దీన్ని అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.సుభాష్, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు కడలి సత్యనారాయణ, కేతా వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో నాగరాజు

మండలంలో పెరగనున్న రెండు ఉన్నత పాఠశాలలు

కె.గంగవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి మండలంలో కోట, భట్లపాలిక గ్రామాల్లోని యూపీ స్కూల్స్ ఉన్నత పాఠశాలలుగా మార్పు చెందుతాయని ఎంఈవో ఏ.నాగరాజు అన్నారు. సోమవారం ఎంఆర్‌సీ భవనంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల మార్పుపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరిపారు. ప్రస్తుతం మండలంలో ఉన్న పది ఉన్నత పాఠశాలలకు మరో రెండు అదనంగా రానున్నాయని, 14 పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా ఏర్పాటు కానున్నాయని తెలిపారు. అదే విధంగా 46 బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగాను, ఆరు ఫౌండేషన్ స్కూల్స్‌గా ఉంటాయన్నారు. దీనిపై రికార్డు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు చెప్పారు. సమావేశంలో ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, ఎంఆర్‌సీలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గంగవరంలో శిక్షణ ఇస్తున్న ఉల్లాస్ పీవో భాస్కరరావు

ఉల్లాస్ వలంటీర్లకు ముగిసిన శిక్షణ

కె.గంగవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వయోజనులకు విద్య నేర్పించడం కోసం ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమంలో పని చేయడానికి నియమితులైన వలంటీర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. వెలుగు మండల కార్యాలయంలో ఉల్లాస్ పీవో భాస్కరరావు వలంటీర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీడీవో ఎన్. శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డి గౌరీ కుమారి, సూపరింటెంట్ సురేంద్ర రెడ్డి, ఏపీయం దుర్గమ్మ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.దుర్గాదేవి, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ. పక్క చిత్రంలో కపిలేశ్వరపురంలో కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

కుష్ఠువ్యాధిగ్రస్తుల సర్వే ప్రారంభం

ఆలమూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి నివారణకు, దాని లక్షణాల గుర్తింపునకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు. ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అధ్వర్యంలో కుష్ఠువ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా పెదపళ్ల వైద్యాధికారి సాయికిషోర్ మాట్లాడారు. ఈ ర్యాలీలో పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ రాజా ఆకుల, హెల్త్ సూపర్‌వైజర్, సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వే సోమవారం ప్రారంభమైంది. జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా నిర్వహించే సర్వేను కపిలేశ్వరపురంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్ ప్రారంభించారు. ఆశా, ఏఎన్ఎంలతో ఇంటింటా సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తామని ఎంపీహెచ్ఈవో జె.మల్లిఖార్జునుడు తెలిపారు. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం వచ్చేనెల 2 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతీ పీహెచ్‌సీ, ఆరోగ్య కార్యకర్త వద్ద ఎండీటీ మందులు ఉచితంగా లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ పువ్వల చిట్టిబాబు, ఏఎన్ఎం శిరోమణి పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు ప్రారంభం

కపిలేశ్వరపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి ఈనెల 30 వరకూ పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనిత తెలిపారు. సోమవారం దీనికి సంబంధించిన షెడ్యూల్ వివరాలను తెలిపారు. నేడు నల్లూరు, వాకతిప్ప గ్రామాల్లో, బుధ వారం వెదురుమూడి, అద్దంకివారిలంకలో, 23న పడమరఖండ్రిక, కపిలేశ్వరపురం, 24న అంగర, తాతపూడి, 25న అచ్యుతాపురం, కేదార్లంక, 27న వడ్లమూరు, మాచర, 28న వల్లూరు, టేకి, 29న నేలటూరు, నాగులచెరువు, 30న కాలేరు, కోరుమిల్లి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. పశువ్యాధు లకు సంబంధించి రెండు బృందాలుగా నిర్వహించే ఈ శిబిరాల్లో పశువైద్యాధికారులు వీవీ రమణమూర్తి, కేబీఎస్ఆర్ ప్రసన్న, పశువైద్య సహాయకులు పాల్గొని పశువ్యాధులకు సంబంధించి సేవలందిస్తారన్నారు.

పశువుల ఆరోగ్యానికి ప్రత్యేక శిబిరాలు

కె.గంగవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిందని పామర్రు పశు వైద్యాధి కారిణి ఎం.బిందు అన్నారు. సోమ వారం యండగండి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పశువులకు గర్భకోశ పరీక్షలు జరిపారు. లేగదూడలకు నట్టల నివారణ మందులు, పశువులకు పలు రకాల మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ఎం.బిందు ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు.



యండగండిలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ బిందు

ఉచిత పశువైద్య శిబిరం

రావులపాలెం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉబలంక పశువైద్యశాలలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి రావులపాలెం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరెడ్డి పాల్గొని పశువులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.లక్ష్మి, జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, డాక్టర్ ఎం. సాయిభాస్కర్, ధనలక్ష్మి, సజహాన్, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ సీహెచ్ వెంకటనారాయణ తెలిపారు. పశువుల సీజ నల్ వ్యాధులపై సోమవారం నుంచి 30 వరకు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ఉచితంగా టీకాలు వేస్తున్నామన్నారు. నట్టల నివారణ మం దులు, గర్భకోశ వ్యాధులకు సంబంధించి మందులను పంపిణీ చేశారు. మంగళ వారం గంటి, బుధవారం అవిడి, 23న పలివెల, 24న మంద పల్లి, 25న కండ్రిగ, 27న బిల్లకుర్రు, 28న వానపల్లి, 29న వాడపాలెం, 30న మోడెకుర్రు గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తా మన్నారు. కార్యక్రమంలో సిబ్బంది టి.ఉమామహేశ్వరావు, బి.రమేష్, ఐ.రాజు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట శివారు పెదగూళ్లపాలెంలో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



పోలమ్మ అమ్మవారు(ఫైల్‌ఫొటో)

పోలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

రాయవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాయవరం పరిసర ప్రాంతాల ఇలవేల్పు అయిన పోలమ్మ తీర్థాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం అమ్మవారి జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ: పోలమ్మ జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాయవరం ఎస్ఆర్ రోడ్డు ఇరువైపులా వివిధ రకాల దేవతామూర్తుల చిత్రాలతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఆకర్షణగా నిలిచింది. రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో వివిధ రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. రాయవరం ఎస్ఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

రావులపాలెం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఈతకోట పాఠశాలలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ సూచనల మేరకు పుస్తకాలు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయనకు వచ్చిన పుస్తకాలు, పెన్నులు వంటివి ఈతకోటలోని జడ్పీ, ఎంపీపీ, అంగన్‌వాడీ పాఠశాలలోని విద్యార్థులకు నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు యర్రంశెట్టి బుజ్జి, ఆకుల శ్రీనివాస్, గంధ్రోతు వీరగోవిందరావు, మానే గోవిందు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

కూర్మాపురంలో భక్తి శ్రద్ధలతో పూజలు

రాయవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కూర్మాపురం గ్రామంలో రెండు రోజులపాటు ప్రత్యేక పూజలు చేసినట్టు నిర్వాహకులు సోమవారం తెలిపారు. అనకాపల్లి జిల్లా దేవిపురం గురూజీ శ్రీ అన్నపూర్ణాంబ సహిత అమృతానంద నాథ సరస్వతి కుమార్తె కందర్ప రమ ఆధ్వర్యంలో వారి బృందం చే పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సిరజ్యోతి పూజ, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో మహాగణపతి, మహాలక్ష్మి అమ్మవార్లకు సామూహిక పూజలు, శత మహా మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వారిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి (కూర్మాపురం అబ్బు), ముత్యాల చంద్రశేఖర్, వట్టికూటి సత్యనారాయణ(బాబి), గొడితి సుధాకర్, మతుకుమిల్లి సూర్యభాస్కర్, గుణ్ణం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

‘దివ్యాంగుల మనోభావాలు దెబ్బతీస్తే ఉద్యమిస్తాం’

రాయవరం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను కించపరిచేలా సినిమాలు తీసే దర్శకులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వెంటూరులో ఆయన మాట్లాడుతూ 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారంలో సినిమాల్లో కుంటి, గుడ్డి వంటి పదాలను వాడకూడదన్నారు. ఇటీవల విడుదలైన ప్రముఖ హీరో సినిమాలో ఒక పాత్ర ద్వారా కుంటి, గుడ్డి పదాలను వాడిన దర్శకులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సినిమా ప్రదర్శనలను అడ్డుకుంటామన్నారు.